# అర్ధరాత్రి బ్రహ్మారథం



**ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే :** గురువారం మధ్యాహ్నం 2.35 గంటలకు మైలవరంకు బాబు మీకోసం యాత్ర చేరాల్సి ఉండగా 4.20 గంటలకు వచ్చింది. అక్కడి నుంచి తెలుగుదేశం కార్యకర్తలు, ప్రజలు ఎక్కువగా తరలి రావడంతో ప్రచార రథం వేగానికి బ్రేకులుపడ్డాయి. జమ్మలమడుగులో సాయంత్రం 4.30 గంటలకు రోడ్‌షో జరగాల్సి ఉంది. ఎనిమిది గంటలకు పట్టణలోని పాత బస్టాండుకు చేరుకుంది. ఇక్కడ బాబు అరగంటకుపైగా ఆవేశపూరితంగా ప్రసంగించారు. పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి సాయంత్రం ఆరు గంటలకు బాబు వస్తారని కార్యకర్తలు ప్రకటించారు. అయితే రాత్రి 10 గంటలకు బాబు పెద్దపసుపుల గ్రామానికి చేరుకున్నారు. 11 గంటలకు పెద్దముడియం మండలం ఉలవపల్లె గ్రామానికి చేరుకుంది. ఆలస్యమైనా ప్రజలు బాబు ప్రసంగాన్ని ఆసక్తిగా, ఉత్సాహంగా కన్పించారు.

## అన్ని చోట్లా అదే ప్రసంగం!

పల్లెల్లో బాబు మీకోసం యాత్రలో భాగంగా చేసిన ప్రసంగంలో మార్పు కన్పించలేదు. చాలా గ్రామాల్లో మరొక గ్రామంలో చెప్పిందే చెప్పుకొస్తున్నారు. పేదరిక నిర్మూలనకు ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా చూసేందుకు, ప్రభుత్వ పథకాలను పరిశీలించేందుకు, రైతుల్లో ధైర్యం నింపేందుకు వచ్చాను. కరెంటు కష్టాలు, నిత్యావసర ధరలు పెరుగుదల, మద్యం, ఎరువుల సమస్యలపై తరచూ వివరిస్తూ వచ్చారు. రుణమాఫీని పదే పదే ప్రశ్నిస్తున్నారు. అన్ని చోట్ల ఒకటే ప్రసంగధార.

## ప్రజల సమస్యలు పట్టవా..?

ముందుచూపు లేకుండా గండికోట పనులకోసం మైలవరం నీటిని వదిలేశారు. ఇప్పుడేమో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆర్టీపీపీని సమస్యలు పట్టి పీడిస్తున్నాయన్నారు. గురువారం రెండు యూనిట్లు ఆగిపోవడం వారి పుణ్యమేనన్నారు. జిల్లాలోని మిగతా ప్రాంతాల ప్రజలకు అన్యాయం చేస్తూ గండికోట నీటిని పులివెందులకు తీసుకువెళుతున్నారని విమర్శించారు. సోమశిల నీటిని సీఎం తన కుమారుడికి చెందిన రఘురాం సిమెంటు పరిశ్రమకోసం తరలించేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు.